విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

30 నాటికి భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు చేపట్టండి

భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్

విశాలాంధ్ర-ఏలూరు: ఈ నెల 30వ తేదీ నాటికి పెండింగ్ లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్ఏ

కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్ లు, జాయింట్ కలెక్టర్లతో రీ సర్వే కి సంబంధించిన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్ డిఓలు, కె. పెంచల కిషోర్, ఝాన్సీరాణి , ఎడి సర్వే వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు పత్రాల పంపిణీ కి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించిందని అందుకుగాను ఈ నెల 30వ తేదీ నాటికి పెండింగ్లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గతంలో భూమిలేని నిరుపేదలందరికీ అసైన్ చేసిన ప్రభుత్వ భూమిలో లబ్ధిదారుడు ఉన్నాడా, వారి వారసులు ఉన్నారా లేదంటే వేరే ఎవరైనా ఉన్నారా వారికి ఏ సంవత్సరంలో కేటాయించారు వంటి వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేసే ప్రక్రియ సెప్టెంబర్ 10 తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ ఫేజ్-2 కింద పెండింగ్‌లో ఉన్న భూహక్కు పత్రాలు జిల్లాకు రాగానే త్వరితగతిన వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర -యలమంచిలి: మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని జిల్లాలో మొట్టమొదటిగా, శుక్రవారం యలమంచిలి మండలంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి యంపిడివో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం గం.10:30లకు జగ నన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులందరూ పాల్గొంటారని తెలిపారు.

సాయిబాబా మృతికి ఐజేయు సంతాపం

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం టీవీ9 రిపోర్టర్ ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియు డబ్ల్యూజె) జిల్లా సహాయ కార్యదర్శి కఠారి సాయి బాబా అకాల మృతికి ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు వాసా సత్యనారాయణ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక సాధారణ ఫోటో గ్రాఫర్‌గా బుట్టాయిగూడెం లో తన ప్రస్థానం ప్రారంభించి, ఆంధ్రప్రభ,మా టీవీ మొదలైన పత్రికలు,న్యూస్ చానల్స్ లో పనిచేసి టీవీ 9లో చేరి సుదీర్ఘ కాలం

పనిచేస్తూ అనారోగ్యంతో అకాల మృతి చెందడం బాధాకరమన్నారు. సాయిబాబా యూనియన్ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొనే వారని ,అందరితో ఆప్యాయంగా వరుసలు కలుపుతూ ఎప్పుడు నవ్వుతూ ఉండేవారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనతోపాటు నివాళులర్పించిన వారిలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు డివి భాస్కరరావు, డి వి ఎల్ఎన్ స్వామి, పి.సాయి, కే వెంకట్, బాలు,వి.శ్రీనివాస్,రమణ రాజు,గంగరాజు,కిషోర్, పలు టీవీ చానల్స్ రిపోర్టర్లు, పత్రికా విలేకరులు ఉన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-టి నరసాపురం: మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేసిన ఉచిత కుట్టు మిషను శిక్షణా కేంద్రాన్ని మద్యహ్నాపు వారి గూడెం సొసైటీ చైర్ పర్సన్ దాసరి రాంబాబు గురువారం

ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు వినియోగించుకోవాలన్నారు. 90 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ వాలంటీర్ శ్యామ్ సుందర్, దాకారపు సూరిబాబు, రెడ్డెం రమాదేవి, ఎం. హరిబాబు, కాంచనమాల, దామిశెట్టి కేశవరావు, తోట రామారావు, రామలింగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే కొయ్యలగూడెంలో మినీజాబ్ మేళా

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కొయ్యలగూడెం ప్రకాశం డిగ్రీ కళాశాలలో ఈనెల 8వ తేదీ శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సమన్వయ అధికారి గంటా సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మిని జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, టీమ్ లీడ్స్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 200 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9666322032, 9652503799 ను (9988853335 - టోల్ ఫ్రీ) ఈ జాబ్ మేళాకు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకలుతో హాజరు కావాలని తెలియజేసారు.

ఉపాధ్యాయునికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర -కలిదిండి: పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసిన అధ్యాపకు నికి ఆర్థిక సహాయం అందజేసినట్లు క్రాంతి హైస్కూల్ కరస్పాండెంట్ చెన్నం శెట్టి కృష్ణ తెలిపారు. మండలంలోని కోరుకొల్లు గ్రామంలో క్రాంతి హై స్కూల్‌లో ఎస్.వి గోపాల్ గతంలో విధులు నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న గోపాల్ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిసి ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు గురుదక్షిణగా రూ. 70 వేలు సమకూర్చగా ఆ నగదును గోపాల్ ఇంటి వద్దకు వెళ్లి అందజేసినట్లు కృష్ణ తెలిపారు. సహృదయంతో ఆర్థిక

సహాయం చేసిన పూర్వపు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా రాజేష్

విశాలాంధ్ర-ఏలూరు: ఎస్‌సి, ఎస్‌టి, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా తోకల రాజేష్ నియమితులయ్యారు. గురువారం స్థానిక శాసనసభ్యులు ఆళ్ల నాని క్యాంపు కార్యాలయంలో సభ్యులుగా నియా మకపు ఉత్తర్వులను ఆళ్ల నాని రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ సమాజంలో దళితులకు ఎక్కడ అన్యాయం జరిగినా నిజాయితీగా, అండగా నిలబడా లని సూచించారు. నిజాయితీగా దళితులకు సేవ చేయాలని హితవు పలికారు. తనను ఎస్ సి, ఎస్ టి, విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులుగా నియమించినందుకు ఆళ్లనానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుదీర్ బాబు, మునిసిపల్ కో ఆప్షన్ మెంబర్. ఎస్. ఎం. ర్ పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

పగడ్బందీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన ప్రక్రియ

- పారదర్శకంగా పూర్తయిన ఇంటింటి పునఃపరిశీలన
- జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : స్పెషల్ సమ్మర్ రివిజన్ 2024లో భాగంగా చేపట్టిన ఇంటింటి పరిశీలన, పునఃపరిశీలన కార్యక్రమం పూర్తయ్యిందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. గురువారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన, ఎస్.ఎస్.ఆర్. 2024 అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పేర్లను పునఃపరిశీలన, విచారణ ప్రక్రియ కూడా పూర్తయ్యి

ందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పక్కాగా మరోసారి పరిశీలన, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టామన్నారు. మృతులు, శాశ్వత వలసలు, ఇతర కారణాలతో నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితానుంచి ఓటర్లను తొలగించిన విషయాన్ని రాజకీయ పార్టీల నాయకులకు ఆయన వివరించారు. సంక్షిప్త ఓటర్ల జాబితా ప్రక్రియ అత్యంత పారదర్శకతతో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఇఆర్ఓ), అదనపు ఎఇఆర్ఓలు వారి పరిధిలోని ప్రతిఒక్క తొలగింపు పరిశీలన చేశారన్నారు. గత ఏడాదిన్నర కాలంలో సుమారు 70 వేల వరకు మరణించిన వారి ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పొరపాట్లు, సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఈ నెల15 లోగా రాజకీయ పక్షాల నాయకులు తమ దృష్టికి తీసుకురావచ్చున్నారు. ఓటర్ల నమోదు చేర్పులు, మార్పులు నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు(బిజెపి), యం. శిర్రా భరత్ రావు(బిఎస్ పి), కలవకొల్లు సాంబ (వై.ఎస్.ఆర్. సిపి), పాలి ప్రసాద్ (టిడిపి), ఇఆర్ఓలు కె.పెంచల్ కిశోర్, డాక్టర్ ఝాన్సీరాణి, జి. సత్యనారాయణ, సూర్యనారాయ రెడ్డి, బాబ్జి, ఏఈ ఆర్ఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన ఓటర్ల జాబితా తనిఖీ

విశాలాంధ్ర-ఏలూరు: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని 7 నియోజక వర్గాలకు చెందిన ఓటర్ల జాబితాకు సంబంధించిన రిజిష్టర్లను, కంప్యూటర్ డేటాను జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

పరిశీలించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో గురువారం ఓటర్ల సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వాన్ని పరిశీలించేందుకు జిల్లాలోని 7 నియోజవకవర్గాల ఇఆర్ఓ, ఎఇఆర్ఓ, సంబంధిత బిఎల్ఓలతో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ర్యాండమ్ చెక్‌ను నిర్వహించారు. డబుల్ ఎంట్రీ అయిన, చనిపోయిన, మరోక ప్రాంతానికి తరలిపోయిన, వలస పోయిన తదితర కారణాల వలన తొలగించబడిన ఓటర్ల జాబితాపరిశీలనలో భాగంగా నియోజకవర్గానికి 100 ఓట్ల చొప్పున కలెక్టర్ ర్యాండమ్ చెక్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎవిఎస్ఎస్ మూర్తి, ఇఆర్ఓలైన సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డిఓలు కె.పెంచల్ కిశోర్, డా.ఝాన్సీరాణి,జి. సత్యనారా యణ, సూర్యనారాయణరెడ్డి, బాబ్జి, ఏఈఆర్ఓ సోమశేఖర్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, తదితరులు పాల్గొన్నారు.

సాటిలేని మేటి నటి భానుమతి

విశాలాంధ్ర -భీమవరం: భానుమతి నటనకే భాష్యం చెప్పారని, వివిధ పాత్రల్లో ఒదిగిపోయి ప్రతి పాత్రలో జీవించారని వాటికి న్యాయం చేసిన ఏకైక నటి భానుమతి అని ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి

ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు. సీనియర్ నటి భానుమతి జయంతి కార్యక్రమాన్ని వెంకట్రామా థియేటర్ కాన్ఫరెన్స్ హాల్లో శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భానుమతి కళామతల్లి ముద్దుబిడ్డ అని కొనియాడారు. సమాజానికి సందేశాన్నందించే పలు పాత్రలు ఆమె పోషించి మెప్పించారని సీతారాంప్రసాద్ కొనియాడారు. శోభన్‌బాబు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ సహజమైన నటిగానే కాకుండా గాయనిగా దర్శకురాలిగా నిర్మాతగా స్టూడియో అధినేతగా సినీ పరిశ్రమకే తలమానికంగా నిలిచిన భానుమతి చిరస్మరణీయులన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ కే చాన్ భాషా, కళ రంజని నాటక పరిషత్ అధ్యక్షులు జవ్వాది శ్రీనివాస్, భానుమతి అభిమాన సంఘ నాయకులు చపా రవి, గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఆనాటి సినీ దిగ్గజాలైన ఎన్టీఆర్, ఎన్నార్ లతో అనేక చిత్రాలు చేశారని అన్నారు. ముందుగా భానుమతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పులపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు, భూరక్ష పథకంపై శిక్షణ

విశాలాంధ్ర - లింగపాలెం : జగనన్న భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో శిక్షణ పొందుతున్న 50 మంది పంచాయతీ కార్యదర్శులకు చంద్రన్నపాలెంలో క్షేత్రస్థాయిలో నిర్వహించే

విధులపై గురువారం శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న కార్యదర్శులు పాల్గొన్నారు. రీసర్వేలో చంద్రన్నపాలెం రెవెన్యూ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూహక్కు, భూరక్ష పథకాన్ని అమలు చేశారు. దీనిలో భాగంగా స్వమిత్వ విధానాన్ని శిక్షణ పొందుతున్న కార్యదర్శులకు ఇక్కడ జరిగిన విధానాన్ని వివరించారు. క్షేత్రస్థాయిలో అవగాహన వల్ల ఈ పథకం అమలు చేయటం సులువుగా ఉంటుందని శిక్షణ ఇచ్చిన సిబ్బంది మణికుమారి, శంకర్ తెలిపారు. ఒకరోజు జరిగిన శిక్షణా కార్యక్రమంలో మఠంగూడెం సర్పంచ్ పొదిల ప్రసాద్, కార్యదర్శి ప్రవీణ్, గ్రామ సర్వేయర్ ప్రమీలారాణి పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

విశాలాంధ్ర - లింగపాలెం : మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శింగగూడెం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. పోటీలను లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, మండల విద్యాశాఖాధికారి

రామారావు ప్రారంభించారు. ఈ పోటీలలో లింగపాలెం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తొమ్మిది రకాల క్రీడా పోటీలను ఈ సందర్భంగా నిర్వహించారు. వీరిలో ప్రతిభ చూపిన 100 మంది క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. శింగగూడెం పాఠశాల ప్రధానోపాధ్యా యులు శ్రీధర్, మండల వ్యాయామ ఉపాధ్యాయుల కో-ఆర్డినేటర్ అలివేలు మంగ, వ్యాయామ మండల ఉపాధ్యాయులు శ్యామల, ప్రకాష్‌రెడ్డి, కామేష్ తదితరులు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-టి నరసాపురం : టి నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురం ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన ఉపాధ్యాయులు గణేష్ లను భుక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. అనంతరం భూక్యా శ్రీనివాస్, జరబల బాలాజీ దాతల సహకారంతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు భూక్యా వేణుగోపాల్ ఆధ్వర్యంలో 130 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేశావత్ వెంకట్, భుక్యా సత్తిబాబు, భుక్యా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి సీపీఐ నేతలు, కార్యకర్తలు

విశాలాంధ్ర - ఏలూరు: సీపీఐ రాష్ట్ర సమితి నిర్వహించిన రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 8 శుక్రవారం తిరుపతిలో జరుగు బహిరంగ సభకు ఏలూరు జిల్లా నుంచి సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్తున్నారని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. సిపిఐ బస్సు యాత్ర ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడులో ఆగస్టు 23, 24 తేదీలలో జరిగిందని, జిల్లాలో జరిగిన బస్సు యాత్రకు జిల్లా ప్రజానీకం

నీరాజనాలు పలికారని ఆయన పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అమలుపరుస్తూ దేశాన్ని రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాలు ఊబిలోకి తీసుకెళ్తున్నాయని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి కావాలన్నా, దేశం ఐక్యతగా లౌకిక రాజ్యంగా ఉండాలన్నా రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వానికి కేంద్రంలో బిజెపి నాయకత్వంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో తగిన బుద్ధి చెప్పి సాగనంపాలని అన్నారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు చరమగీతం తథ్యం

సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర-భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదింపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని సిపిఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సిపిఐ బస్సు యాత్ర ముగింపు సంద ర్భంగా తిరుపతిలో జరుగు తున్న సిపిఐ ప్రజాప్రద ర్శన, బహిరంగ సభకు పశ్చిమగోదావరి జిల్లా నుంచి సిపిఐ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా భీమవరం పట్టణ రైల్వే స్టేషన్లో భీమారావు మీడియాతో మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అడుగడుగునా సమస్యలతో సతమతమవుతున్నారని విమర్శించారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పించడం అని, బటన్ నొక్కడం కాదని హితవు పలికారు. కేంద్రంలో నరేంద్ర మోడీ పేదలు, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఆదాని, అంబానీకి దేశ సంపదను దోచిపెట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని విమర్శించారు. సిపిఐ తిరుపతి బహిరంగ సభకు సిపిఐ పశ్చిమ గోదావరి జిల్లా నుండి రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకటరావు, సనపల శ్రీనివాస్, పతివాడ గణపతి, కోనగొల్లయ్య, పీతల రవి, తమరాని శ్రీనివాస్, దొమ్మేటి నాగరాజు తదితరులు తిరుపతికి తరలి వెళ్లారు.

సీపీఐ బహిరంగ సభ జయప్రదం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన ప్రచార జాతా బస్సు యాత్ర ఈనెల 8వ తేదీ శుక్రవారం తిరుపతిలో జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభతో ముగుస్తుందని, ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జెవి రమణ రాజు పిలుపునిచ్చారు.

గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో రమణ రాజు మాట్లాడారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్ట్ 17 వ తేదీన విశాఖ పట్నంలో ప్రారంభించిన బస్సు యాత్ర ఈ నెల8వ తేదీతో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలలో ఈ బస్సు యాత్ర పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల మధ్య ఎండగట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు మద్యనిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్ గెలిచిన తర్వాత రాష్ట్రంలో మద్యం ద్వారా అక్రమంగా కోట్ల రూపాయలను దండుకుంటున్నారన్నారు.నాసిరకం బ్రాండ్ల తో మద్యం ఏరులై పారుతుండడంతో ఎంతోమంది యువకులు మద్యానికి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో మోడీని, రాష్ట్రంలో జగన్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కుంచే వసంతరావు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లాలోని 108 సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల తో మాట్లాడి కృషి చేస్తామని జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. ఏలూరు లోని జెడ్పి క్యాంపు కార్యాల యంలో చైర్మన్‌ను ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాల 108 యూనియన్ నాయకులు కలిసి సమస్యల తో కూడిన వినతి పత్రాన్ని అందించారు. జిల్లాలోని 108 సిబ్బంది అత్యవసర పరిస్థితుల్లో కూడా

సమర్ధ వంతంగా విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి అందించిన 108 వాహనాలు నిలిపేందుకు షెల్టర్ తో పాటు మందులు నిలవ చేసేందుకు స్థలం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో వర్షా కాలంలో మందులు తడిసి పోయి నిరుపయోగంగా మారుతున్నాయని, వాహనాలు ఎండకు ఎండి వానకు తడిసి మరమ్మత్తులకు గురవుతున్నాయన్నారు. తొలుత ప్రజలకు అందిస్తున్న 108 సేవల పై ఆరా తీశారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ అధ్యక్షులు ప్రసాద్, జనరల్ సెక్రటరి కే రమేష్, కే ఎం జయరాజు, బీ శ్యామ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తొలగించిన ఓటును నూరు శాతం పరిశీలించాలి

విశాలాంధ్ర-భీమవరం: తొలగించిన ప్రతి ఓటు డాక్యుమెంటును నూరు శాతం క్రాస్ వెరిఫికేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో సమావేశమై తొలగించిన ఓట్లు పునః పరిశీలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ రీవెరిఫికేషన్

ప్రక్రియను బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. ఎన్నికల కమీషన్ సూచనల మేరకు జనవరి 6, 2022 తేదీ నుంచి ఆగస్టు 9, 2023వ తేదీ వరకు వచ్చిన తొలిగింపులను నియోజక వర్గాల ఇఆర్వోలు నూరు శాతం క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నియోజకవర్గానికి నియమించిన ప్రత్యేక అధికారులు ఇఆర్వోలు చేపట్టిన ఓటర్లు తొలగింపు పరిశీలనను తిరిగి పునఃపరిశీలించాలని ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతి నియోజకవర్గం క్లైములు పరిశీలన చేయడానికి సంబంధిత ఫైల్స్ సిద్ధంగా ఉంచాలన్నారు. జనవరి 6, 2022 నుండి జరిగిన అన్ని తొలగింపులను తిరిగి ధృవీకరించడం, తద్వారా అటువంటి తొలగింపులన్నీ సరైన డాక్యుమెంటేషన్‌తో ఎన్నికల కమిషన్ సూచించిన విధానం ప్రకారం జరిగాయని తిరిగి ధృవీకరించాల్సి వుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తాడేపల్లిగూడెం డిఆర్ఓ కే.కృష్ణవేణి, ఆచంట టూరిజం ఆర్ జె డి స్వామి నాయుడు, పాలకొల్లు డి సి ఓ ఎం రవికుమార్, నరసాపురం డి ఐ ఓ వి.ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'

- గ్రామ, వార్డు సచివాలయ స్థాయి ఆటలు పోటీలు అక్టోబరు 02 నుండి 09 వరకు
- జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్‌సుందర్ రెడ్డి

విశాలాంధ్ర-భీమవరం: క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై జాయింటు కలెక్టరు అధ్యక్ష తన గురువారం స్థానిక కలెక్టరేట్ జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబరులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలను నిర్వహిస్తున్న

దన్నారు. జిల్లాలో 535 గ్రామ,వార్డు సచివాలయాల పరిధిలో పోటీలను నిర్వహణకు సెప్టెంబర్ 30వ తేదీనాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు స్థాయిలో యంపిడివోలు, వార్డు స్థాయిలో పురపాలక సంఘం కమిషనర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఇందుకు దాతలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలను వినియోగించుకోవాలన్నారు. క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యా యులకు, సిబ్బందికి, ఆడ, మగ వారికి వేరు వేరుగా స్థానిక వసతి గృహాలు కేటాయించాలని సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు ఆదేశించారు. క్రీడాకారుల సామగ్రి భద్రపరచుటకు మండల, జిల్లా స్థాయిలో స్టాకు పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. 15 ఏళ్ల దాటిన గ్రామీణ యువతీ, యువకులతో పాటు, ఉన్నత పాఠశాలలో 10 వ తరగతి, ఆపైన జూనియరు కాలేజీలు, కళాశా లలు విద్యార్థినీ విద్యార్థులు పోటీలలో పాల్గొనేలా విద్యాశాఖ అధికా రులు బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు అక్టోబరు 02 వ తేదీ నుండి 09 వరకు,మండల స్థాయి అక్టోబరు 10 వ తేదీ నుండి 21 వరకు,నియోజవర్గ స్థాయి అక్టోబరు 22 వ తేదీ నుంచి 27 వరకు,జిల్లా స్థాయి అక్టోబరు 28 వ తేదీ నుండి నవంబరు 03 వరకు,రాష్ట్ర స్థాయి నవంబరు 04 వ తేదీ నుండి 08 తేదీ వరకు జరుగుతాయ న్నారు. ఈ సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాల స్పోర్ట్స్ అథారిటీ, సెట్వెల్ సిఈవో యం డి హెచ్ మెహర్ రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వర రావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి, పురపాలక సంఘం కమిషనరు యం.శ్యామల, రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఇన్‌స్పెక్టర్ యం.రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహం లేకపోవడం శోచనీయం

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : ప్రకాశం చౌక్ నామకరణం చేసిన ప్రాంతంలో ప్రకాశం చౌక్ పంతులు విగ్రహం లేకపోవడం శోచనీయమని, ప్రధాన కూడలి అయిన ఈ సెంటర్ లో ధర్నాలు, నిరసనలు తెలియజేసే ప్రాంతంలో ఆయన విగ్రహం

లేకపోవడం దేవుడు లేని గుడిలా ఉందని, అందరి సహకారంతో విగ్రహాన్ని నెలకొల్పుతానని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కోయ్యే మోషేన్ రాజు గురువారం తెలిపారు. కుల మత రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలని, ఎంతో కాలంగా ఈ విషయంపై విగ్రహ కమిటీ సభ్యులు కోరుతున్నారని, ప్రకాశం చౌక్ పంతులు విగ్రహ స్థాపనకు సంపూర్ణంగా సహకరిస్తానని అన్నారు. వినతిపత్రం అందించిన కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ దీనికి సంబంధించి ఎంతోమంది దాతలు సిద్ధంగా ఉన్నారని, 25 ఏళ్లుగా విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులను కోరడం జరుగుతుందని అన్నారు. త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసర్ల ముత్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో వైకాపా దాడులు అమానుషం

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రలో వైకాపా నాయకులు అలజడులు సృష్టిస్తూ దాడులు చేయడం అమానుషమని పోలవరం మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు మండిపడ్డారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈమేరకు ఆయన వైకాపా ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. జగన్

పాదయాత్ర చేసినప్పుడు నాటి ముఖ్యమంత్రి పటిష్ట భద్రత కల్పించబట్టే రాష్ట్రంలో తిరగగలిగారని గుర్తుచేశారు. ఇప్పుడు లోకేష్‌కు భద్రత కల్పించకపోగా వైకాపా నాయకులను ఉసిగొల్పి దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మరల చంద్రబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యి ఆంధ్ర రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దుతారని తెలిపారు.

లోకేష్‌ను విమర్శించే అర్హత కారుమూరికి లేదు

విశాలాంధ్ర-తణుకు: లోకేష్ గురించి మాట్లాడే అర్హత మంత్రి కారుమూరికి లేదని, లోకేష్ పై మంత్రి కారుమూరి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెదేపా తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం స్థానిక నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

యువగళం పాదయాత్ర పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు 6 నియోజకవర్గాల్లో పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. వైసిపి నాయకులు చేసినటువంటి కామెంట్లుకు దీటుగా లోకేష్ 206 రోజుల్లో 2818 కిలో మీటర్లు నడిచి తన సత్తా చాటి చూపించారన్నారు. స్థానిక శాసనసభ్యుల కనుసన్నల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రౌడీ మూకలకు పోలీసులు వత్తాసు పలకడం జరిగిందని అన్నారు.

ఈ నీరు తాగేదెలా?

విశాలాంధ్ర - పెనుమంట్ర: మండలంలోని ఆలమూరు పంచాయతీ పరిధిలో కోమటి చెరువు గ్రామంలో గత కొన్ని నెలల నుంచి మంచినీరు కలుషితమై బురద నీరుగా వస్తున్నదని కోమటి చెరువు గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది కూడా వరుసగా మంచినీళు కలుషితమై బురదగా వచ్చాయని, గ్రామ ప్రజలు అధికారులకు పలు సార్లు విన్నవించుకోగా సమస్య పరిష్కరించినప్పటికీ, మరలా కొన్ని నెలలుగా మంచినీటి పైపులలో నుంచి బురద నీరు వస్తుందని ఈ త్రాగునీరు ఈ విధంగా ఉంటే ఎలా తాగేదని గ్రామాన్ని పరిపాలించే నాయకులు కానీ సంబంధిత అధికారులు గానీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి ముందుకు రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.గ్రామ ప్రజలు దూర ప్రాంతాల నుండి మంచినీరు కొనుగోలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కలుషితం అవుతున్న మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ పి. సూర్యనారాయణ రాజు వివరణ కోరగా సమస్య వారి దృష్టికి వచ్చిందని క్షేత్రస్థాయిలో డి .ఈ తో కలసి పరిశీలన చేయగా బోర్ మొత్తం పాడైపోవడంతో ఇటీవల జగనన్న కాలనీ కోసం ఏర్పాటు చేసిన కొత్త బోరును నుండి తాత్కాలికంగా ఆ గ్రామానికి నీటిసరఫరా అందించమని పంచాయతీ వారికి ఆదేశాలు జారీ చేశామని త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని ఆయన అన్నారు .

స్కిప్పింగ్ పోటీలు

విశాలాంధ్ర - పాలకొల్లు: సెప్టెంబర్ నెల రోటరీ యూత్, సర్వీస్ మంత్‌లో భాగంగా శుక్రవారం పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లు గురుకుల విద్యాలయంలో వివిధ స్కూల్స్ నుండి వచ్చిన విద్యార్థులు కు స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ రావు మాట్లాడుతూ పోటీలలో గెలుపొందిన వారికి జూనియర్స్, సీనియర్స్ విభాగం నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విద్యార్థులకు అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ రావాడ సతీష్,రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, ఫాస్ట్ ప్రెసిడెంట్ లు మద్దాల వాసు, చందక రాము, కటారి నాగేంద్ర, రోటరీ సభ్యులు కానూరి ప్రభాకర్, పోతాబత్తుల సత్యనారాయణ, గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ మహాపాత్ర, వివిధ స్కూల్స్ నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా విన్నకోట రమణ

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు ప్రెస్ క్లబ్ అభివృద్ధితోపాటు పాత్రికేయుల సంక్షేమానికి అందరి సమిష్టి నిర్ణయంతో నిరంతరం పని చేస్తానని ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ బాధ్యతలు తీసుకుంది. క్లబ్ అధ్యక్షునిగా విన్నకోట వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఎంఎస్‌వి సాంబశివరావుఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. క్లబ్ కోశాధికారిగా తోట రాంబాబు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విన్నకోట రమణ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన పూర్వాధ్యక్షులు కెవిఎస్ఎల్ నరసింహారాజు మాట్లాడుతూ తన ఏడాది కాలంలో జరిగిన కార్యకలాపాలను వివరించారు. ఐజేయూ సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్య క్షుడు పిటి వెంకటేశ్వరరావు లు మాట్లాడుతూ క్లబ్ నూతన కమిటీ బాధ్యతగా మెలిగి సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. క్లబ్ నూతన ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ వి సాంబశివరావు మాట్లాడుతూ నూతన కమిటీ మాటలు తక్కువ పని ఎక్కువ అనే రీతిలో సంఘ అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. సహ పాత్రికేయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విన్నకోట రమణ, ప్రధాన కార్యదర్శి సాంబశివరావులను ప్రెస్ క్లబ్ తరపున నాయకులు శాలువా కప్పి పూలమాలవేసి సత్కరించారు. సభలో సీనియర్ పాత్రికేయులు వీరా సత్యం, కాగిత సూర్యనారాయణ, మండెల అప్పలరాజు, మానాపురం సత్యనారాయణ, బిఈ తిరుమలరాజు, పడాల గోపికృష్ణ, రాపాక రవిబాబు, బండి శ్రీనుబాబు, జయ రామకృష్ణ, కే. శాంతారామ్, కూనపురెడ్డి చిన్ని, తమ్మినీడి మురళీకృష్ణ, సరగం సత్యనారాయణ, కాటంశెట్టి రాంబాబు, కర్రా నాయుడు, జంపన నాగేంద్రప్రసాద్, షేక్ బాబాజీ, ఎస్ శాంతారామ్, సురేష్, నాని, భాను, తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర -కొయ్యలగూడెం : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కొయ్యలగూడెం ఏ వీ ఆర్ ఎం స్కూల్ వద్ద గల షిర్డీ సాయి మందిరం లో భక్తులు గోకులాష్టమి వేడుకలు పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు. చిన్ని కృష్ణుని లీలలు వర్ణిస్తూ నృత్యరూపకం ప్రదర్శించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి మందిరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యవసాయ, నీటిపారుదల సలహా మండలి సంయుక్త ప్రత్యేక సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: జిల్లా వ్యవసాయ సలహా మండలి, నీటిపారుదల సలహా మండలి సంయుక్త సమావేశం ఈ నెల 8వ తేదీ శుక్రవారం సాయంత్రం గం. 4లకు గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని ఏలూరు ఇరిగేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు కె. శ్రీనివాస్ తెలిపారు. ఖరీఫ్ 2023-24(ఫసలి 1433) పంటకు సంబంధించి వర్షాభావ పరిస్థితులు అనుసరించి వ్యవసాయ పంటలకు నీటి లభ్యతపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సాయంత్రం గం. 4లకు నిర్వహించే సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల సలహా మండలి సభ్యులందరూ హాజరు కావాల్సిందిగా కోరారు.

లోకేష్ పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రపై గునుపూడి వద్ద దాడి చేసిన వైసిపి నాయకులను వెంటనే అరెస్టు చేయా లని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి డిమాండ్ చేశారు. వన్ టౌన్ పోలీసు అధికారులను ఆయన గురువారం కలిసి నారా లోకేష్ పై దాడి చేసి హత్యాప్రయత్నం చేసిన వారిని వదిలి తెలుగుదేశంపార్టీ నాయకులు యువగళం వాలంటర్లపై హత్యాయత్నం అక్రమకేసులు పెట్టి అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నీలతి రమేష్, టిడిపి నాయకులు ఎద్దు ఏసుపాదం, ఎండి నౌషాద్, గంటా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడే రాట్నాలకుంటలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర-పెదవేగి: ప్రతి బుధవారం, శుక్రవారం మండలస్థాయిలో జేకేసి గ్రీవెన్స్ డే నిర్వహణలో భాగంగా పెదవేగి మండలం రాట్నాలకుంటలో జిల్లా కలెక్టర్ స్థాయిలో మొట్ట మొదటి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ తెలిపారు. మండలంలో రాట్నాలకుంట మెయిన్ రోడ్ లోని సాయిబాబా గుడివద్ద గల అన్నపూర్ణపంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం గం.10 నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండల ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. చింతలపూడి మండలంలో ఈ నెల 13వతేదీన, ద్వారకాతిరుమల మండలంలో 15న, టీ. నర్సాపురం మండలంలో20న, ఉంగుటూరు మండలంలో 22న, ముసునూరు మండలంలో 27న, కలిదిండి మండలంలో 29న నిర్వహిస్తారని తెలిపారు.

బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే శక్తి కాంగ్రెస్‌కే ఉంది

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : ప్రజా సమస్యలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే శక్తి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకే ఉందని మాజీ ఎంపి కనుమూరి బాపిరాజు అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ జోడో యాత్ర చేపట్టి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుని పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్షుడు మార్నీడి బాబ్జీ ఆధ్వర్యంలో జయలక్ష్మీ సెంటర్ నుండి హౌసింగ్ బోర్డ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపి కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెట్రోలు, డీజిల్, నిత్యవసర సరుకులు ధరలు పెంచి సామాన్యునిపై ధరల భారం మోపాయన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రవేటీకరణ చేయడంతో ఉద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. నిరంతరం దేశ ప్రజా సమస్యలపై పోరాడుతూ కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉందని వచ్చే ఎన్నికల్లో మత తత్వ పార్టీ బిజెపిని గద్దె దించేందుకు ఓటు రూపంలో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. మార్నీడి బాబ్జీ మాట్లాడుతూ బిజెపి ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా దేశంలో ఓర్పు, సహనంతో కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై పోరాడుతుందన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్యులు రోడ్డున పడ్డారని అన్నారు.. రాహుల్ ప్రధాని అయితే దేశం విద్య, ఉద్యోగం, వైద్యం, మౌళిక వసతులు, రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని. అన్నారు. కేంద్రంలో బిజెపిని ధీటుగా ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్కి మాత్రమే ఉందన్నారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా 'అధరం-మధురం'

విశాలాంధ్ర-ఆకివీడు : అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా తెలుగు కన్నడ భాషలలో అధరం- మధురం చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు కన్నడ చిత్ర దర్శకుడు నారి శ్రీనివాస్(స్మైల్ శ్రీనివాస్)చెప్పారు. గురువారం ఆకివీడు వచ్చిన ఆయన తెలుగు చిత్ర దర్శకుడు, ఈటీవీ శివలీలలు ఫెమ్ పువ్వాడ విజయభాస్కర్‌తో కలిసి ఆకివీడులోని ప్రముఖ న్యాయవాది పువ్వాడ రాజా అమర్నాథ్ నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చిత్ర విశేషాలు గురించి ఆయన వివరించారు. ద్విభాష చిత్రంగా తిరకెక్కే ఈ చిత్రాన్ని ఆకివీడు, భీమవరం ప్రాంతాల్లో చిత్రీకరణ చేస్తామన్నారు. ఇప్పటివరకు తాను కన్నడ భాషలో ఐదు చిత్రాలు తీసినట్లు చెప్పారు. వీటిలో ఓ మై లవ్ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందడమే కాక 50 రోజులు దిగ్విజయంగా ప్రదర్శించబడిందన్నారు. యూట్యూబ్లో ప్రేక్షకుల మన్ననలు పొందడమే కాక వారి నుంచి మంచి కామెంట్స్ కూడా ఆ చిత్రం పొందిందన్నారు. జనవరి నుంచి అధరం-మధురం చిత్రం షూటింగు ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే సాంకేతిక నిప్పులతో పాటు, పాటల రికార్డింగ్, ప్రీ ప్రొడక్షన్ పనులలో నిమగ్నమై ఉన్నట్లు ఆయన చెప్పారు. హీరో, హీరోయిన్లను ఎంపిక చేయాల్సి ఉందన్నారు.మాటకు ఎంత విలువ ఉండాలి, ఎంత మధురంగా ఉండాలి అనే పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు చెప్పారు. గుండెకు హత్తుకుపోయే సన్నివేశాలతో పాటు, కుటుంబ కథాచిత్రంగా అందర్నీ అలరించే విధంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు స్మైల్ శ్రీనివాస్ చెప్పారు.

వైభవంగా ఆలయంలో పవిత్ర మాసకళ్యాణ మహెూత్సవాలు

విశాలాంధ్ర - ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం చేవూరుపాలెం సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ వల్లి దేవసేన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి పవిత్ర మాసోత్సవ కల్యాణ మహెూత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దంపతులను, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణలను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ శొంఠి నాగరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నేల సంధ్య, అర్చక బృందం వేదమంత్రాలతో, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే , ఎమ్మెల్సీలను దుశాలవాతో సత్కరించి స్వామివారి ఫోటోలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య , వైస్ ఎంపీపీ రాచూరి రాధ, నాయకులు బోయిన రామరాజు, కోమటి విష్ణువర్ధన్ బొర్రా శేషుబాబు, గంటా కోటేశ్వరరావు , బేతపూడి వెంకటరమణ, పైడిపాటి వెంకటరమణ, చీదేళ్ళ సుబ్రహ్మణ్యం , ఆనందదాసు శివ నాగేంద్ర, రంగిశెట్టి నరసింహారావు, ట్రస్టీ బోర్డు సభ్యులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేధా ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కృష్ణాష్టమి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కొయ్యలగూడెంలో మేధా ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వద్ద కరస్పాండెంట్ మధు ఆధ్వర్యంలో వందమంది చిన్నారులతో శ్రీకృష్ణుని

వేషాధారణలు, గోపికల వేషధారణలు, చిన్నారులతో వేయించి జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ఉట్టు కొట్టించారు. స్కూల్ ప్రాంగణమంతా విద్యార్థిని విద్యార్థుల ఆటపాటలతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనరాజు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

విశాలాంధ్ర-ఆకివీడు: ఆకివీడు ఐ భీమవరం రోడ్లో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రైస్ మిల్ కార్మికుడు పైల చిన్న అప్పలనాయుడు (45) మృతి చెందాడు. బుధవారం రాత్రి తాళ్లకోడు లోని ఒక గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి ఆకివీడు ఎస్సై బి నాగబాబు సీసీ ఫుటేజీ పరిశీలించారు. అయితే స్థానికులు ఇది మర్డర్ అని భావిస్తూ ఆందోళన చేపట్టారు .మృతుడు దుంపగడప రైల్వే గేటు సమీపాన మిద్దే వారి వీధికి చెందిన మృతుడికి ఒక కుమారుడు కుమార్తె ఉన్నారు. ప్రమాదపు వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

ఘనంగా మాస్టర్ జీ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పోలమ్మ చెరువుగట్టు జై బుద్ధని పార్క్‌వద్ద విశ్వజనా కళామండలి జాతీయ అధ్యక్షులు, ప్రజా వాగ్గేయకారులు, సినీ గేయ రచయిత, ములవాసుల సిద్ధాంతకర్త మాస్టర్ జీ 72వ పుట్టినరోజు వేడుకలు విశ్వజనా కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డీ నాగేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి భారీ కేకు కట్ చేసి మాస్టర్ జికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డి నాగేశ్వరరావు మాట్లాడుతూ మాస్టర్ జీ విలువలను కొనియాడారు, మాస్టార్ జీ అంబేద్కర్ సిద్ధాంతాన్ని తన పాఠం ద్వారా కళల ద్వారా తన నైపుణ్యం ద్వారా ప్రసారం చేసే గొప్ప వ్యక్తి అని, కళాకారుడు, కార్యక్రమంలో రమాబాయి సంఘం మహిళా మండలి అధ్యక్షురాలు పుణ్యమతుల రజని, బిఎస్ఐ జనరల్ సెక్రెటరీ మట్ట వెంకటరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జె సత్యనారాయణ, బిఎస్ఐ నాయకులు యమ్ ఆశీర్వాదం, ఆర్‌పిఐ రాష్ట్ర ప్రధాన అధ్యక్షులు పివి చక్రవర్తి, మెండి కమల, విశ్వజనా కళా మండలి జిల్లా అధ్యక్షురాలు కాశి సింహాద్రి వర్య, కేఎస్ ఎన్ మూర్తి, బీర ప్రమీల, జంగా జ్యోతి, బీర నాగ దుర్గ, బీర లావణ్య, మెండి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం హౌసింగ్ జల జీవన మిషన్ హెల్త్ సంబంధించి సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దుర్గారావు మాట్లాడుతూ దేవరపల్లిలో జగనన్న కాలనీలో ఇళు నిర్మించుకోవడానికి లబ్ధిదారులు మరింత ముందుకు రావాలన్నారు. దేవరపల్లి మండలంలో అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యంగా సిసి రోడ్లు డ్రైన్లు నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో కృష్ణంరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, హౌసింగ్ ఏఈ ముఖర్జీ, మండల పరిషత్ సూపరింటెండెంట్ జి. శాంతి మండలంలోని అధికారులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నూతన భవన శంకుస్థాపన

విశాలాంధ్ర - ఉంగ్రాజవరం: బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణం కొరకు మోర్త గ్రామంలో స్థలం కేటాయించి, సహకరించిన పిఎసిఎస్ అధ్యక్షులు ఆలపాటి నరేంద్ర ప్రసాద్‌కు మోర్త బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. గురువారం గ్రామంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనంను అధ్యక్షులు వీరవల్లి వెంకట సుబ్బారావు, లక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. 250 మంది సభ్యులు గల తమ సంఘానికి గ్రామ పంచాయతీకి చెందిన ఆరు సెంట్లు స్థలమును కేటాయించిన పంచాయతీ సర్పంచ్ చిటికెన సుజని, ఉప సర్పంచ్ దాపర్తి సందీప్, పంచాయతీ బోర్డు మెంబర్లకు ఈ సందర్భంగా సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు తణుకు నాయకులు కామన మునిస్వామి, తూరు గోపు వెంకటేశ్వరరావు, ఉంగ్రాజవరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ నిమ్మన వెంకట శ్రీనివాస్, సంఘం వైస్ ప్రెసిడెంట్ ఉచ్చింతల ఉప్పలాచారి, సెక్రటరీ అమ్మిన ప్రకాష్, జాయింట్ సెక్రెటరీ షేక్ వలీ, కోశాధికారి చప్పిడి హనుమంతరావు, అయిసెట్టి విజయరాజు , పినిశెట్టి ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడవద్దు అండగా ఉంటా

విశాలాంధ్ర-ఉండి: ప్రజలు అధైర్య పడవద్దు...అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. మంగళవారం తెదేపా జాతీయ కార్యదర్శి లోకేష్ పాదయాత్రలో భీమవరం నియోజకవర్గం గునిపూడిలో జరిగిన సంఘటన చాలా బాధాకరమని ఉండి మాజీ శాసనసభ్యులు వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. లోకేష్ పాదయాత్ర పై అల్లరి మూకలు, రాళ్లు, సీసాలు విసిరి కర్రలతో దాడి చేయడం మంచి పరిణామం కాదని వారు మండిపడ్డారు. ఇటువంటి పరిణామం ఇదే మొదటి సారి అని ఇటువంటి ఆచారాన్ని తీసుకురావడం సమంజసం కాదని వారు హితవు పలికారు లోకేష్ పై దాడి చేయడం అమానుషం అని ఇంతవరకు గోదావరి జిల్లాలలో ఇటువంటి దుర్ఘటన జరగలేదని ఇది వైకాపా తోనే మొదలయ్యిందన్నారు.యువగళం పాదయాత్రకు పార్టీ కుటుంబ సభ్యులందరూ అండగా నిలుస్తూ జయప్రదం చేయాలని వారు కోరారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

విశాలాంధ్ర - రాజోలు : మండలం వ్యాప్తంగా గురువారం సాయంత్రం కృష్ణాష్టమి వేడుకలు పలు ప్రాంతాలలో ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో రాజోలు మండల కేంద్రం రాజోలు భారం వారి వీధిలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. ఒకవైపు వర్షం వస్తున్నా గాని వారు వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపికలు ఉట్టు లాగుతుంటే కృష్ణుడు వేషంలో ఉన్న చిన్నారి ఉట్టు కొట్టడం చూపరులను ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

30 నాటికి భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: ఈ నెల 30వ తేదీ నాటికి పెండింగ్ లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.గురువారం విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్ లు, జాయింట్ కలెక్టర్లతో రీ సర్వే కి సంబంధించిన అంశాల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు పత్రాల పంపిణీ కి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించిందని అందుకుగాను సెప్టెంబర్ 30వ తేదీ నాటికి పెండింగ్ లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కొన్ని జిల్లాల్లో ఆన్లైన్ నందు పెండింగ్ లో ఉన్న కరెక్షన్ ఆఫ్ మాడ్యూల్స్ అంటే భూ హక్కు పత్రాలలో వచ్చే వ్యక్తి పేరు, ఊరి పేరు, ఖాతా నెంబరు తదితర వాటిని వెరిఫై చేసే వాటిలో ఎటువంటి తప్పిదాలు లేకుండా ఈ శనివారం నాటికి పూర్తి చేయాలని తదనంతరం భూ హక్కు పత్రాలను జెనరేట్ చేసి ప్రింటింగ్ కి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు. గతంలో భూమిలేని నిరుపేదలందరికీ అసైన్ చేసిన ప్రభుత్వ భూమిలో లబ్ధిదారుడు ఉన్నాడా, వారి వారసులు ఉన్నారా లేదంటే వేరే ఎవరైనా ఉన్నారా వారికి ఏ సంవత్సరంలో కేటాయించారు వంటి వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేసే ప్రక్రియ సెప్టెంబర్ 10 తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ ఫేస్ 2 కింద పెండింగ్ లో ఉన్న భూహక్కు పత్రాలు జిల్లాకు రాగానే త్వరితగతిన వెంటనే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె. జాషువా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఒకే డోర్ నెంబర్‌లో 10 ఓట్లు మించి ఉండకూడదు

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు నియోజకవర్గం పరిధిలో ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించేందుకు కొత్త ఓట్లు నమోదు చేసేందుకు బిఎల్‌వోలు విధులు నిర్వహిస్తున్నారని రాజోలు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వి. శివశంకర ప్రసాద్ తెలిపారు. గురువారం రాజోలు తహసీల్దార్ కార్యాల యంలో రాజోలు నియోజక వర్గం పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఒకే డోర్ నెంబర్లు 10 ఓట్లు మించి ఉండకూడదని అటువంటి వాటిని గుర్తించి సవరిస్తున్నామన్నారు. కొత్త ఓట్లు నమోదుపై దృష్టి సారిస్తున్నామని, దానికి రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలన్నారు. రాజోలు, మలికిపురం తహశీల్దార్‌లు బిఎం ముక్తేశ్వరరావు, వివిఎల్ నరసింహారావు, డిప్యూటీ తాసిల్దారులు సిహెచ్ భాస్కరరావు, శ్రీనివాసరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో మహాశక్తి చైతన్య రథయాత్ర

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ గంధం మహేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గోడే దొరబాబు ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళల మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహాశక్తి కమిటీ వైస్ చైర్మన్ పాలూరి బోసు బాబు, కంచుమర్తి రాఘవ, దాపర్తి సీతారామయ్య, మహిళలతో కలిసి భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ నియోజకవర్గ అభివృద్ధి చెందాలంటే జ్యోతుల నెహ్రూను రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని భావితరాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టో రూపొందించడం జరిగిందని విజయదశమికి సంపూర్ణ మేనిఫెస్టో రూపొందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలినాటి ధర్మానందకుమారి, నకిరెడ్డి సూర్యవతి, గుమ్మల అనంతలక్ష్మి, రాపాక లక్ష్మి, ఎల్లాటి అమ్మాజీ, గొల్లవిల్లి శ్రీదేవి, చెక్కా మరియా, గొల్లవిల్లి వరలక్ష్మి, తిప్పన సత్యవతి, గోడే దొరబాబు, కొల్లా రాజారావు, కొల్లి చిన్నారి, గేడ్డం వెంకట అప్పారావు, పి మహాలక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోడె రాజా కొల్లి గంగ, తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటు దోష నివారణకు ఏఆర్‌వీ వ్యాక్సిన్

విశాలాంధ్ర - ఆలమూరు : కుక్కకాటు దోష నివారణకు వినూత్న రీతిలో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్ వీ)ను కుక్కలకు అందించిన సంఘటన ఆలమూరు మండలంలోని మోదుకూరులో బుధవారం జరిగింది. కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను తీవ్రంగా గాయపరుస్తున్నాయనే విషయాన్ని గ్రామస్తులు స్పందనలో ఇచ్చిన పిర్యాదు మేరకు గ్రామ పంచాయతీ సత్వరమే స్పందించింది. గ్రామ సర్పంచ్ పెంటపాటి శ్యామల వెంకట్రావు, కార్యదర్శి పి రాజు నేతృత్వంలో పశు వైద్యాధికారి జి సుభాష్, క్షేత్ర స్థాయి గ్రామ సహాయకులు కె రమేష్ తదితరులు గ్రామంలో ఉన్న కుక్కలన్నింటిని పట్టుకుని ఏఆర్ వీని అందజేశారు. దీనివల్ల పొరపాటున కుక్క కరిచినా ఏవిధమైన దోషం ఉండదని వైద్యాధికారి సుభాష్ పేర్కొన్నారు. కుక్కలకు ఏ విధమైన హానిలేకుండా జననాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామ పంచాయతీ చేపట్టిన ఈ వ్యాక్సిన్ పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ చంద్రు సునీత, నల్లి రాజు, ఆకుల రామ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

9న జనసేన మహాసంకల్పయాత్రకు శ్రీకారం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం జనసేనపార్టీ గెలుపే లక్ష్యంగా మహాసంకల్ప యాత్ర ఈ నెల 9వ తేదీ ఉదయం ప్రారంభించనున్నట్లు జనసేన అమలాపురం ఇంచార్జ్ శెట్టిబత్తుల రాజబాబు తెలిపారు. అల్లవరం మండలం తాడికోన శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం యాత్ర షెడ్యూల్ విడుదల చేస్తామన్నారు. అధినేత పవన్ కళ్యాణ్ అనుమతితో ఈ మహాసంకల్ప యాత్ర చేపడుతున్నామన్నారు. మహాసంకల్ప యాత్ర కరపత్రం జనసేనాని పవన్ కళ్యాణ్ చేతులమీదుగా ఆవిష్కరించామని రాజబాబు చెప్పారు.

సర్వమానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువే

విశాలాంధ్ర - పెద్దాపురం : సర్వ మానవాళికి మార్గదర్శి క్రీస్తు ఏసు ప్రభువేనని ప్రముఖ దైవజనులు కె అభిషేక్, జయకుమార్‌లు అన్నారు. మండలం లోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్ధనా మందిరంలో రెవరెండ్ నంగిన సత్యా నందం ఆధ్వర్యంలో సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన మూడు రోజుల ఉపవాస ప్రార్ధనలు నిర్వహించారు. సీజీఎం వ్యవస్థాపకుల శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన ఉపవాస కూడికల్లో వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతికై ప్రతీ ఒక్కరూ పరిశుద్ధ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో అశాంతి వాతావరణం నెలకొందని, ప్రశాంత వాతావారణం కోసం ప్రతీ ఒక్కరూ మోకరిల్లు ప్రార్ధన ఎంతో అసవరమన్నారు. తద్వారా ప్రపంచ శాంతి ఏర్పడుతుందని. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని అయన సూచించారు. అనంతరం మందిరం నిర్వహకులు శామ్యూల్ సుదీప్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ప్రార్ధనల్లో భాగంగా రెండవ రోజు ప్రసంగాలందించడం జరిగిందన్నారు. 8వ తేదీతో ఉపవాస ప్రార్ధనలు ముగిస్తాయన్నారు. ఈ సందర్భంగా ఫాస్టర్ ఆనంద్ కుమార్ ఆలపించిన క్రైస్తవ భక్తిగీతాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిజిఎం బందం, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.